

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదు : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్లు, మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌పి వకుల్ జిందల్ కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలని సూచించారు. సింగిల్ విండో విధానంతో సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనం అనుమతులు పొందవచ్చునని తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలూ చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడానికి పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

- 8,240 మెట్రిక్ టన్నులు లోటు
- పట్టించుకోని ఎమ్‌పి, ఎమ్మెల్యేలు
- ఆందోళనలో రైతులు
- పలుచోట్ల అధిక ధరలకు విక్రయం
- బస్తాపై రూ.200 వరకు అదనం
- పురుగుమందులనూ అంటగడుతున్న వ్యాపారులు

సంతకవిటి మండలం మామిడిపల్లిలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

ఎరువుల కొరత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఎరువుల కొరత తీవ్రతరమైంది. దీంతో, రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పలుచోట్ల రైతులు ఆందోళనకు దిగినా ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టకపోవడం గమనార్హం. విత్తనాల సరఫరా, జలాశయాల్లో నీరు విడుదల తదితర సందర్భాల్లో ఫోటోలకు ఫోజులిచ్చిన ప్రజాప్రతినిధులు ఎరువుల కొరత వచ్చినప్పుడు మాత్రం స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, పెసలు, మినుములు, తదితర 16 రకాల పంటలు 2,92,482 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా ఇప్పటి వరకు 2,12,495 (73శాతం) ఎకరాల్లో సాగైంది. ఇందులోనూ అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,28,035 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,68,267 ఎకరాల్లో (74శాతం) సాగైంది. పడిన వరి నాట్లకు ప్రస్తుతం రెండో దఫా యూరియా అవసరం అని సాక్షాత్తు వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారు. మిగిలివున్న 26శాతం విస్తీర్ణంలో కూడా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముమ్మరంగా నాట్లు పడుతున్నాయి. సాధారణంగా ఉబాలు పడుతున్నప్పుడే యూరియా వేస్తారన్న విషయం అందరికీ తెలిసిన సంగతే. ఇటువంటి సమయంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురిచేస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం వివిధ పంటల సీజనల్ కండీషన్ బట్టి జిల్లా వ్యాప్తంగా 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి వచ్చింది కేవలం 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీన్నిబట్టి 8,240 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్టుగా స్పష్టమౌతోంది. ఈ సంగతి అటుంచితే... జిల్లాకు వచ్చిన యూరియాలో 50శాతం అంటే దాదాపు 12,180 మెట్రిక్ టన్నుల వరకు ప్రైవేటు డీలర్లకు వెళ్లింది. మిగిలిన 50శాతం మార్కెఫెడ్ ద్వారా 30శాతం రైతు సేవా కేంద్రాలకు, 20శాతం పిఎసిఎస్‌లకు తరలించి రైతులకు పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం పెచ్చుమీరడంతో సామన్య రైతుల వరకు వెళ్లలేదు. మొత్తంగా యూరియా లోటును ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు పురుగుల మందులు కొంటేనే యూరియా విక్రయిస్తామంటూ మెలికపెట్టడంతో రైతులు కొనలేక, వ్యవసాయం మానుకోలేక సతమతమౌతున్నారు. చివరకు అప్పులు చేసి మరీ అవసరం లేని పురుగుల మందులను కూడా కొనుక్కోవాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొరత నేపథ్యంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ ధరపై రూ.200 అదనపు వసూళ్లు

రాజకీయ నాయకుల జోక్యం వల్ల గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో యూరియా, డిఎపి దొరకడం లేదు. ఈనేపథ్యంలో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల్లో బస్తా యూరియా రూ.264, డిఎపి రూ.1350 ఉండగా ప్రైవేటు వ్యాపారులు బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతులు వ్యాపోతున్నారు. ఇదేమంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో యూరియా దొరకడమే గగనం అంటూ వ్యాపారులు సెలవిస్తున్నారు. సభలు, సమావేశాల్లో సందుదొరికితే అధికారులపై చిందులు వేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు యూరియా కొరతపై స్పందించక పోవడంతో రైతులు ఒకింత ఆగ్రహం, ఆవేశం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 20రోజులుగా ఎరువులు రాలేదని, ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోతే తామేం చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మొద్దునిద్ర వీడి రైతులకు అవసరమైన యూరియాతోపాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచే విధంగా పనిచేయాలని రైతాంగం కోరుతోంది.

అదనపు భారం

నాకు 50 సెంట్లు వరి పొలం ఉంది.ఒక్క బస్తా అడిగినా దుబ్బు గుళికలు వేసుకోవాలని బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారు. దీంతో 800 రూపాయల వరకు అదనపు భారం పడుతుంది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. రైతులు గోడు ఎవరికీ పట్టడం లేదు.

గంట్యాడ గణపతి, సాలిపేట, గజపతినగరం మండలం

యూరియా అందించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం

బొబ్బిలి : రైతులకు యూరియా సంపూర్ణంగా సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరినాట్లు 90 శాతం పూర్తి అయినా యూరియా సక్రమంగా అందించలేదన్నారు. యూరియా దొరక్క పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రయివేట్ వ్యాపారులు.. డిఎపి కొంటేనే యూరియా ఇస్తామని షరతు పెట్టడం వల్ల రైతులు కొనలేని పరిస్థితి ఉందన్నారు. ఎరువులు సకాలంలో వేయకపోవడంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణమే యూరియా అందుబాటులో తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు యు.ప్రసాద్, ఆర్.త్రినాథ పాల్గొన్నారు.

యూరియా బస్తా రూ.600కు కొన్నాను

యూరియా దొరకడం అతి కష్టంగా ఉంది. కొరత ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు అధిక ధరకు అమ్ముతున్నారు. అయితే దుబ్బు గుళిక అవసరం లేకపోయినా అది కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా రూ.280 ధర చెబితే ఎరువు దుకాణం వద్ద రూ. 320 తీసుకుంటున్నారు. చివరికి బ్లాక్ లోని రూ. 600 ఇచ్చి కొన్నాను. తక్షణమే ప్రభుత్వం రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి.

- ముద్దాన శ్రీనివాసరావు, రైతు, సంతకవిటి

ఎరువులు ఇప్పించండి మహాప్రభో

ఎరువుల కొరత విపరీతంగా ఉంది. నేను కౌలు రైతును. ఎరువులు లేక నానా అవస్థలు పడుతున్నాను. రైతు సేవా కేంద్రం నుండి మాకు ఎరువులు ఇవ్వడం లేదు. సంతకవిటిలోని ఎరువులు దుకాణం వద్ద రూ. 18వందలు నుండి 2వేలు రూపాయలు వరకు డిఎపి, యూరియా అమ్ముతున్నారు. దుబ్బు గుళికలు కొంటేనే యూరియా అమ్ముతున్నారు.

- గండి హరినాథ్, రైతు, చింతలపేట, సంతకవిటి మండలం

అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది

రైతు సేవా కేంద్రాలు , పిఎసిఎస్‌లో ఎరువులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుక్కోవాల్సి వస్తోంది. ఏటా ఇదే పరిస్థితి. సకాలంలో ఎరువులు వేయకపోతే పంట ఎదిగే పరిస్థితి లేదు. అధికారులు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచాలి.

- చల్ల గౌరి నాయుడు, పాత బగ్గాం, గజపతినగరం మండలం

నోటికాడ కూడు లాగేశారు

వికలాంగుల ఆవేదన ● అధికారులకు విన్నపాలు

'దశాబ్దానికి పైగా వికలాంగ పింఛను అందుకుంటున్నాం. అదే ఆధారంగా బతుకుతున్నాం. ఉన్నట్టుండి పింఛను తొలగించి, నోటికాడ కూడు లాగేశారు. వికలాంగత్వంతో ఏ పనీ చేయలేం. ఇలాగైతే ఎలా బతికేది.'

రామభద్రపురంలో సిపిఎం ఆధ్వర్యాన వినతి అందిస్తున్న వికలాంగులు

పింఛన్లు తొలగించిన వికలాంగుల ఆవేదన ఇది. ప్రభుత్వ నిర్లక్ష్య చర్యతో రోడ్డున పడ్డామంటూ జిల్లా వ్యాప్తంగా గగ్గోలు పెడుతున్నారు. పింఛను మొత్తం పెంచారనే ఆనందించేలోగా జీవనం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం పలుచోట్ల అధికారులకు వినతులు అందజేశారు. పింఛన్లు పునరుద్ధరించకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు.

సిపిఎం ఆధ్వర్యంలో వినతి

రామభద్రపురం : మండలంలో 243 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సన్యాసిరావుకు వినతిపత్రం అందించారు. అర్హులైన వారిని కూడా చాలా మందికి రద్దుచేశారని తెలిపారు. చాలా మందికి 40 శాతం పైబడి వికలాంగత్వం ఉన్నప్పటికీ రద్దుచేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల ఆందోళన

తెర్లాం : మండలంలోని వికలాంగుల పెన్షన్లు తొలగించడంపై బాధితులు లబోదిబోమంటున్నారు. పాత సదరంలో వంద శాతం వికలాంగత్వం ఉన్నా పింఛను తొలగిస్తున్నారని, ఇది అన్యాయమని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగవైకల్యం శాతంలో తేడాలు చూపించి పింఛను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంపిడిఒ రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా, మండలంలో 196 పింఛన్లు తొలగించారని, వీటిలో 55 మందికి వృద్ధాప్య పింఛన్లుగా మార్చారని వివరించారు.

పునరుద్ధరించండి : ఎంపిపి

విజయనగరం కోట : రద్దు చేసిన వికలాంగులఎ పింఛన్లు వెంటనే పునరుద్ధ రించాలని ప్రభుత్వాన్ని. విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రద్దయిన పింఛనుదార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో 216 మంది వికలాంగుల ఫించన్లు ఇప్పటికే రద్దు చేసారని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష పింఛన్లు రద్దు అయినట్లు సమాచారం ఉందని తెలిపారు. ఈనెల 27 లోగా మండల పరిషత్ నుంచి గాని సచివాలయానికి గాని పింఛను పునరుద్ధరణ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు సారిక సత్యనారాయణ, వికలాంగులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగింపు అన్యాయం : శంబంగి

బొబ్బిలి : వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీ అమలుకు తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లు రద్దు చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 30 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేయడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. పింఛనే ఆధారంగా జీవిస్తున్న వికలాంగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పింఛన్ల తొలగింపుపై వైద్యులకు టార్గెట్ ఇవ్వడంతోనే వికలాంగులకు అంగవైకల్యం శాతాన్ని తగ్గించి పింఛన్లు రద్దు చేశారని ఆరోపించారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాలకు వెళ్తే వికలాంగులు బోరున విలపిస్తున్నారన్నారు. అర్హత ఉన్న వికలాంగులందరికీ పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు బి.సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం సమగ్రాభివృద్ధి అవసరాలు - అవకాశాలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

పట్టణ పౌర సంక్షేమ సంఘం ముద్రించిన విజయనగరం సమగ్రాభివృద్ధి అవసరాలు, అవకాశాలు అనే పుస్తకాన్ని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస ఆవిష్కరించారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా పుస్తకాన్ని ఆవిష్కరి ంచారు. అనంతరం పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా, నగర అభివృద్ధికి కావలసిన అవసరాలు, ఉపాధి కల్పన కోసం ఏప్రిల్ ఐదో తేదీన సెమినార్ నిర్వహించినట్లు తెలిపారు. అందులో జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించిన అంశాల ఆధారంగా పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించారు. జిల్లాను సమగ్రాభివృద్ధి చేయాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణ ఉపాధి పథకం, మామిడి, జీడి పరిశ్రమలు ఏర్పాటు చేయడం, మూతపడిన పరిశ్రమలు తెరిపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మంత్రి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాలకులు విజయనగరం సమగ్రాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేసి వెనుకబాటు నుంచి తప్పించాలని, వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి.రామచంద్రరావు, అస్లామ్ పాల్గొన్నారు.

సిఐకి కోర్టు నోటీసులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కోర్టు ఉత్తర్వులు చూపిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట సిఐకి కంటెంప్ట్ కోర్టు నోటీసులు జారీ చేసినట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిందాల్ కంపెనీ యాజమాన్యం భూములు ఇచ్చిన రైతులను మోసగించిన కారణంగా నిశ్శబ్ద ర్యాలీలు, శాంతియుత నిరసన ప్రదర్శనలు, రిలే నిరాహార దీక్షలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలంటూ పోలీసులకు పలుమార్లు దరఖాస్తు చేశామన్నారు. ఇక్కడ అనుమతులు నిరాకరిస్తుండటంతో జి.ఈశ్వర్ రావు, పొడుగు రేవతి, ముత్యాల సన్యాసమ్మ, గోపాలరావు అనే బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. పిటిషన్ పరిశీలించిన హైకోర్టు.. పిటిషనర్లు పోలీసులకు ముందుగానే దరఖాస్తు ఇవ్వాలని, దానిని పరిశీలించి చట్టబద్ధంగా పోలీసులు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. కానీ పోలీసులు ఏ విధమైన నిర్ణయమూ తీసుకోకపోవడంతో ఈ చర్య కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని, పోలీసులకు కోర్టు ధిక్కార నోటీసు జారీ చేశారని తెలిపారు. 5 రోజుల్లో కోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేసే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు.

క్వారీల్లో యథేచ్ఛగా పేలుళ్లు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి-వేపాడ

యథేచ్ఛగా బ్లాస్టింగ్ చేస్తున్న క్వారీ ఇదే

మండలంలోని కొండగంగుపూడి సచివాలయ పరిధిలో ఉన్న ఎస్‌కెఆర్‌పురం, పికెఆర్‌పురం రెవెన్యూల్లో నిర్వహిస్తున్న క్వారీల్లో యథేచ్ఛగా పేలుళ్లు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తూ కొండను పిండి చేస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భారీ పేలుళ్లతో కొండలను పిండి చేసి ప్రజల ప్రాణాలకు హాని తలపెడుతూ కాసులు పోగేసుకుంటున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా రిగ్ బ్లాస్టింగ్ చేయడంతో సమీప గ్రామస్తులకు కంటిపై కునుకు లేకుండా పోతోంది. క్వారీల్లో అక్రమ బ్లాస్టింగ్‌లపై జిల్లా అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంగన్వాడీల బ్లాక్‌డే

- ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలి
- వేతనాలు పెంచాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు కూడలిలో మానవహారం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్, గజపతినగరం రూరల్

అంగన్వాడీలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన గురువారం దేశ వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌డే నిర్వహించారు. నల్లచీరలు ధరించి నిరసన ర్యాలీలు చేపట్టారు.

విజయనగరంలోని ఎల్‌బిజి భవన్ నుంచి మయూరి కూడలి వరకు, అక్కడ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు అంగన్‌వాడీల భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సునీత, కె.ప్రభావతి, గౌరవాధ్యక్షులు చిట్టితల్లి మాట్లాడుతూ లబ్ధిదారులను ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని , కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ చట్టం ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ యాప్ వల్ల పిల్లలకు పౌష్టికాహారం, బాలింతలు, గర్భిణీల సంరక్షణ , ప్రీస్కూల్ నిర్వహణ వంటి కీలకమైన విధుల నిర్వహణకు ఆటంకంగా కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై పని భారం పెరిగి అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో అంగన్వాడీ సెక్టార్ లీడర్లు రాజేశ్వరి, సరస్వతి ,మంగ లక్ష్మి, కరుణ, సుశీల, జీ దుర్గా దేవి , తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెంటాడ నాలుగు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు, లబ్ధిదారులకు ఇబ్బందిగా మారిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మట్టిఖర్చులకు రూ.20వేలు ఇస్తామని చెప్పి రూ.15వేలకు ఇచ్చిన జీవోను రద్దు చేయాలని, గ్రాట్యుటీని చట్ట ప్రకారం అమలు చేస్తూ జీవో ఇవ్వాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేదంటే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, రాష్ట్రఫ ప్రభుత్వం 2019 నుంచి వేతనాలు పెంచలేదని, కావున పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు యం సుభాషిని, పి.జ్యోతి, డి.నాగమణి, బి.పైడ్రాజు, బి.సుజాత, కె.రమణమ్మ, బి.పద్మ, దమయంతి, జి.సన్యాసమ్మ అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

బొండపల్లి : మండల కేంద్రంలో మోడీ బుద్ధిమార్చాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతినిచ్చి నిరసన తెలిపారు. ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇ.కుమారి, డి.శాంతి, కె.హైమా, నారాయణమ్మ , జ్యోతి అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో గాంధీ విగ్రహానికి వినతిని అందజేశారు. అనంతరం విశాఖ- అరకు రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు డి శ్యామల, మాణిక్యం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : అంబేద్కర్ విగ్రహం నుండి గ్రామం మధ్యలో ఉన్న రామ మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం డిప్యూటీ తాహశీల్దార్ డి.సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు ఎస్ గోపాలం, జి.లక్ష్మి మాట్లాడారు. పెరుమాలి, తెర్లాం, నెమలాం సెక్టారు పరిధిలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొత్తవలస : ఐసిడిఎస్ పాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు కాకర తులసి, సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బాడంగి : సిఐటియు నాయకులు సురేష్ ఆధ్వర్యాన అంగన్వాడీలు ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో రవణమ్మ తుదితరులు పాల్గొన్నారు

వేపాడ : మండలంలోని అంగన్వాడీలు.. తహశీల్దార్ రాములమ్మకు వినతి అందించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాట్యుటీలో మార్పు చేయాలని కోరారు.

వంగర : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటీ జీవోలు మార్పు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు గురువారం నిరసన చేపట్టారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి.భారతి, కుమారి, వెంకటరత్నం, మీనాకుమారి, అప్పల నరసమ్మ, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వివిధ సమస్యలపై అంగన్వాడీ కార్యకర్తలు గురువారం మూకుమ్మడిగా వినతిపత్రం అందించి నిరసనలు వ్యక్తం చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని, పనిచేసిన ఫోన్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 82 అంగన్వాడి కేంద్రాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారిపై గురువారం అంగన్‌వాడీలు మానహారం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు చిన్నమ్మలు, పద్మ, జ్యోతి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

కొత్తవలసలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, నాయకులు

బొండపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతినిస్తున్న అంగన్వాడీలు

జెఎన్‌టియుజివిలో ఎటిఎల్ మెంటార్‌షిప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిలో మూడు రోజుల పాటు నిర్వహించే ఎటిఎల్ మెంటార్‌షిప్ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వ బిసిడిఇ కార్యదర్శి ఎం.ఎల్.ఎస్. దేవకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఇఒ మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఎపిసి రామారావు, రాష్ట్ర నోడల్ అధికారి డి.మాదవీలత, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ పాల్గొని, ప్రసంగించారు. జెఎన్‌టియుజివి వైస్ చాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపల్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపిటిఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉచిత బస్సు ప్రయాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేసేందుకు శుక్రవారం డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి జి.వరలక్ష్మి తెలిపారు. ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఐదు రకాలైన బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించామని, బస్సులలో ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా 9959 225640 నెంబర్ కు కాల్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారం

రైతుల హర్షం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చొరవతో మండలంలోని పిరిడి నుంచి నందబలగ వరకు 12 గ్రామాలకు తోటపల్లి బ్రాంచి కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందుతోంది. ఈ నెల ఒకటో తేదిన ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు.. సాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎసిబి వలలో అవినీతి చేప

ప్రజాశక్తి-వేపాడ

ఎసిబి వలకు అవినీతి చేప చిక్కింది. మ్యుటేషన్ కోసం రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడింది. ఈ సంఘటన వేపాడ మండలంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సింగరాయి వీఆర్‌ఒ సత్యవతి.. ఎస్‌కెఆర్‌పురం సచివాలయానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. సింగరాయి, గుడివాడ రెవెన్యూ పరిధిలో పలువురు రైతులనుంచి భూమి మ్యుటేషన్ కోసం రూ.1.70 లక్షలకు వీఆర్‌ఒ ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం వేపాడ సమీపంలో రైతు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి రమ్య ఆధ్వర్యాన దాడి చేసి పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐ మహేశ్వరరావు, ఎస్ఐ వాసు నారాయణరావు పాల్గొన్నారు.

పట్టుబడిన వీఆర్‌ఒ సత్యవతి, స్వాధీనం చేసుకున్న నగదు

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు

ప్రజలను మోసగించిన చంద్రబాబు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల హామీలను అమలు చేయకుండా సిఎం చంద్రబాబు ప్రజలను మోసగించారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్ప నాయుడు విమర్శించారు. పట్టణంలోని 30వ వార్డులో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని చెప్పి అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశాలతో నెల్లిమర్ల పట్టణ పరిసరాలు, డైట్ కాలనీ, రైల్వే ట్రాక్, బాలికల వసతి గృహాలు, సిఎంఆర్ కాలేజ్, మిమ్స్ హాస్పిటల్ పరిసర ప్రాంతాలు, పూడెమ్మ తల్లి గుడి రోడ్డు మీద కూడా డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి తదితర వాటి ఆచూకీ కోసం చర్యలు చేపడుతున్నామన్నారు.

పథకాలపై అవగాహన

పూసపాటిరేగ : మండలంలోని కోనాడలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి సురక్షా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోనాడ సర్పంచ్ ప్రతినిధి బొద్దు ఎల్లాజీ, జనసేన యువ నాయకుడు విజ్జపు కిరణ్, బ్యాంకు మేనేజర్ ఈ. సూరి నాయుడు, ఫీల్డ్ ఆఫీసర్ తేజ, క్యాషియర్ రాజేష్, ఏపిఎం అచ్యుత్ రావు, కోనాడ ఫీల్డ్ అసిస్టెంట్ శివ, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

కారుణ్య సంస్థ వితరణ

బొబ్బిలిరూరల్ : కారుణ్య సంస్థ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. పిరిడి పిహెచ్‌సిలో గోపాల రాయుడి పేట పంచాయతీలో కొత్తబట్టివలస గిరిజన గ్రామానికి చెందిన మెల్లిగా గొర్రెమ్మ అనే బాలింతకు పౌష్టికాహారం, ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని కారుణ్య సంస్థ కార్యదర్శి జెసిహెచ్ ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జెసి రాజు, వైద్యాధికారులు భరద్వాజ, వంశీకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ బుల్లి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

యువతకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

విజయనగరం కోట : 'హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ నిమిత్తం 20ఏళ్ల వయస్సు పైబడిన ఆసక్తిగల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు ఏదైని కాల పరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగియున్న పురుషులు/స్త్రీలు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. దరఖాస్తులను కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, డాక్టర్ అంబేద్కర్‌రెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం–535003 అని ఈనెల 21 నుంచి 27లోగా దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. శిక్షణకు ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను మాత్రమే ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ 90300147422, సీనియర్ అసిస్టెంట్ 9642460838 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం టౌన్ : ఈనెల 22న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్శాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. దాసన్నపేట సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం రామకృష్ణ నగర్, టౌన్ సెంటర్ లేఅవుట్, శ్రీనివాస నగర్, భవానీ నగర్, వినాయక నగర్, కృష్ణాపురం, స్వామి దే ఆవుట్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు. పూల్‌బాగ్ పరిధిలో ఇప్పిలి వీధి, బుంగివీధి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఏరియా, కోలగట్ల వారి వీధి, కొనిశి వీధి, అర్జెల్లివారి వీధి, మంగళ వీధి కాలనీ, ప్రేమ సమాజం ఏరియా, విజయలక్ష్మి నగర్, కొత్తపేట గొల్ల వీధి, స్పీకర్ కాలనీ, కుమ్మర వీధి విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

శృంగవరపుకోట : జామి మండలంలో 11 కెవి విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇఇ సురేష్ బాబు తెలిపారు. జామి మండలంలోని లక్ష్మీపురం, జాగరం, పావాడ, లక్కవరపుకోట మండలంలో నాయుడుపేట, వీరభద్రపేట, శృంగవరపుకోట మండలంలో ఆలుగుబిల్లి పరిసర ప్రాంతాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఎరుకలపాకలు గ్రామానికి చెందిన పాలవలస రాము కుమారుడికి పచ్చకామెర్లు రావడంతో ఎంపిటిసి పాలవలస గౌరు, యువత రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. పాలవలస రాము కుమారుడు (9 నెలలు) పచ్చకామెర్ల బారిన పడి విశాఖపట్నంలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో చికిత్స నిమిత్తం గౌరు ఆధ్వర్యాన యువత ఆర్థిక సాయం చేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపిటిసి పాలవలస గౌరు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిందే

- చీపురుపల్లిలో విద్యార్థుల ఆందోళన
- మూడురోడ్ల కూడలిలో విద్యార్థుల మానవహారం
- చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి: ఎస్ఎఫ్ఐ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

అపరిష్కృతంగా ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిందేనని ఎస్ఎఫ్ఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం మండలంలో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడు రోడ్ల కూడలి వద్ద విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకీ మాట్లాడుతూ రెండేళ్లుగా స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్ ఉండిపోయాయని, గత ప్రభుత్వం గానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గానీ ఈ స్కాలర్షిప్ నిధులు విడుదల చేసే విధంగా కృషి చేయడం లేదని అన్నారు. పేద విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్షిప్ మీద ఆధారపడి చదువుకుంటున్నారని, స్కాలర్షిప్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల అర్థాంతరంగా చదువులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.6,800 కోట్ల స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ జాయిన్ అయితే జీవో నెంబర్ 77 పేరుతో వారికి రావలసిన స్కాలర్షిప్స్ లను ఆపేసారని, ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చారని ఆ హామీ నిలబెట్టుకునే విధంగా ఆ జీవోని రద్దుచేసి పీజీ విద్యార్థులు కూడా స్కాలర్షిప్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికంగా బీసీ అమ్మాయిల హాస్టల్‌లో వాటర్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మెటిక్ ఛార్జీలు ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. పలు విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 25న విజయనగరంలో జరగబోయే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు భారతి, నాని, మండలం కమిటీ సభ్యులు తేజ, శ్రీలత, మధులత, జగదీష్‌లతో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి కనబడట్లేదా?

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణకి కనబడట్లేదా అని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ప్రశ్నించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొత్స విలేకర్ల సమావేశంలో ఆడిన మాటలు విచిత్రంగా ఉన్నాయన్నారు. ఎన్నికల హామీలు మూడు వేల రూపాయలకు పింఛను పెంచడానికి నాలుగేళు పట్టిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గానికి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ఎంఎస్‌ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ కోసం బొత్స మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా ఆపిందే టిడిపి అని చెప్పారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బిసి నాయకులు కంది మురళి నాయుడు, విజ్జపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్‌కు అభినందన

ప్రజాశక్తి-తెర్లాం

సర్వేయర్ మణికంఠకు మెమొంటో అందజేస్తున్న తహశీల్దార్

ఉత్తమ సేవలు అందించిన మండలంలోని కూనాయ వలస గ్రామ సర్వేయర్ పి.మణికంఠ.. విజయనగరంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుక ు న్నారు. ఈ మేరకు గురువారం సర్వేయర్ మణికంఠను తహ శీల్దార్ జి.హేమంత్ కుమార్ అభినంది ంచారు. ఈ సందర్భం గా మెమొంటో ను అంద జేశారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించి, మరిన్ని అవార్డు లు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, మండల సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో శనివారం స్వచ్ఛాంధ్ర : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈనెల 23న 4వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. ఈ వారం డ్రైన్ క్లీనింగ్ , పారిశుధ్యం ప్రధానాంశంగా తీసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా నీటి నిల్వలు లేకుండా చూడడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయడం, నీటి నాణ్యతలను పరీక్షించడం, పాఠశాలల్లో హ్యాండ్ వాష్ పై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రా కార్యక్రమాల్లో స్వచ్ఛాంధ్రా సంస్థలు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమం లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని సత్య డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బిఎ విద్యార్థి టి. బంగారు నాయుడు వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరచి, జిల్లా తరపున జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు 2025 ఆగస్టు 22 నుండి 24 వరకు విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్నాయి. ఈ ఎంపిక జిల్లా వాలీ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, పీడీ ఎస్ హెచ్ హెచ్ ప్రసాద్ అభినందనలు తెలిపారు

సీతంలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి హాజరైన సీతం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడంతో పాటు, స్మార్ట్ లెర్నింగ్, భావోద్వేగ మేధస్సు, కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. మెరుగైన ప్లేస్‌మెంట్‌లను పొందడానికి విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో మంచి శాతంతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామమూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పలు విభాగాధిపతులు విద్యార్థులకు అవకాశాలు, భవిష్యత్తు కెరీర్ ప్రణాళికలపై మార్గనిర్దేశం చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన అందించాలని కొత్తవలస ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. గురువారం కొత్తవలస పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎంపిపి గోపమ్మ అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, సురక్షితమైన మంచినీటి సరఫరాపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీదేవి, వైద్యాధికారి సీతల్ వర్మ, సిహెచ్‌ఒ అప్పలకొండ, ఇఒ సన్యాసినాయుడు, సూపర్‌వైజర్లు సూరిదేముడు, బేబిరాణి, నిర్మల, సీనియర్ సహాయకులు వాణి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థిక వనరులను పరిపుష్టం చేసుకుంటూనే మరోవైపు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామనినగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. గురువారం వార్డు పర్యటనలో భాగంగా 46వ డివిజన్ లో ఆయన పర్యటించారు. కణపాకలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏ విధంగా లభిస్తున్నాయని క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అయితే కొన్నిచోట్ల వీధి దీపాలు సరిగా లేవని, మరికొన్ని చోట్ల కాలువలు మరమ్మతులకు గురయ్యాయని వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీధులలో భవన నిర్మాణ సామాగ్రిని వేయడానికి గమనించిన ఆయన సంబంధిత సచివాలయ కార్యదర్శిని మందలించారు. మీడియాతో మాట్లాడుతూ కొన్నిచోట్ల ఆస్తి పన్ను పరిధిలోకి రాని భవన నిర్మాణాలను గుర్తించామని వాటిని కూడా తక్షణమే పన్నులు విధింపు చర్యలు చేపడతామన్నారు. స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ మాట్లాడుతూ తమ డివిజన్‌కు 20 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని, వాటితో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, బద్దూరు లక్ష్మణరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనంతరం 17వ డివిజన్ గాంధీ పార్కును పరిశీలించారు. రూ.40.48 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు. రూ.6.06 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. రూ.6.02 లక్షలతో గాంధీ పార్క్ చుట్టూ ప్రహరీ గోడ, పిల్లల క్రీడా సామాగ్రి ఏర్పాటు చేస్తామన్నారు. రూ.28.40 లక్షల సాధారణ నిధులతో ఓపెన్ ఆడిటోరియం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.


46వ డివిజన్‌లో పర్యటిస్తున్న సహాయ కమిషనర్ అప్పలరాజు

ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ శ్రీశైలం ఎర్రగొండపాలెం వద్ద ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బందిపై ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేయి చేసుకుని విచక్షణ రహితంగా కొట్టడం చాలా దారుణమన్నారు. ఎమ్మెల్యే అయి ఉండి అర్ధరాత్రి ప్రజలకు రక్షణగా శ్రీశైలం అడవులలో బాధ్యతగా ఉద్యోగాలు చేస్తుంటే వారిపై మీరు దాడి చేస్తారా అని ప్రశ్నించారు డిప్యూటీ సీఎం వెంటనే స్పందించి దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంఇఒ మూర్తికి ఘన సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉత్తమ ఎంఇఒగా ఎంపికైన మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ మూర్తిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు గురువారం సత్కరించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపు లభించిందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్, ఎపిటిఫ్ మండల అధ్యక్షులు ఉంద్రు శ్రీనివాసరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పొట్నూరు వాసుదేవరావు, ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి వంకర రమణ, యస్‌సి, యస్‌టి సంఘం జిల్లా అధ్యక్షుడు లోపింటి ప్రసాద్, సత్యానందం, కె.త్రినాధరావు, కె.పద్మావతి, ఆర్.చంద్రకళ, కె.జయశంకర్, ప్రెయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-వేపాడ

కషాయాలతో తెగుళ్ల, పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఆనందరావు తెలిపారు. మండలంలోని ఓబులపాలెం, బొద్దాం, పాటూరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయి పర్యటించి, ద్రవ జీవామృతం తయారీపై రైతులకు వివరించారు. వరి పంట పొలాలను క్షేత్రస్థాయి పరిశీలించి, రైతులు అదనపు ఆదాయం పొందడానికి గట్లపై తీగజాతి కూరగాయల మొక్కలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై వివరిస్తున్న డిపిఎం

ఇంటింటా జ్వర పీడితులపై సర్వే

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలిలో రేగిడి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ అసిరి నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గురువారం వైద్య సిబ్బంది సర్వే చేసి గుర్తించారు. వర్షాకాలం సీజనల్ కారణంగా జ్వరాలు, జలుబు, దగ్గు వంటివి ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడి ఆహారాన్ని భుజించాలన్నారు. జ్వరం వచ్చినట్లయితే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వీరితోపాటు హెల్త్ సూపర్‌వైజర్ అప్పారావు, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి రూ.40 వేలు విరాళం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని గుంపాం రాయగడ అమ్మవారి గుడి నిర్మాణానికి రూ.40వేలును జనసేన సీనియర్ నాయకులు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు గురువారం ఆలయ కమిటీకి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా బలపడడానికి ఆలయాలు నిర్మాణాలు మన సంస్కృతి అన్నారు. అందుకే ఆలయాల నిర్మాణాలకు తన వంతు సహకరం అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గుంపాం జనసేన నాయకులు ఆల్తి అప్పలనాయుడు, బొబ్బాది శంకర్ రావు, సువ్వాడ సురేష్, గ్రామ పెద్దలు కిలారి రామారావు, యడ్ల పకీరు, బొబ్బాది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.రామకృష్ణారావు తెలిపారు. ఐదో తరగతి పాసై ఉండి ఏ పాఠశాలలో ఇంకా చేరకుండా ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు.

వైద్య శిబిరాలను వినియోగించు కోవాలి : హౌసింగ్ పీడీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. గురువారం గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో స్వామి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని కేటరాక్ట్ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి స్వామి ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయనున్నట్లు ఆస్పత్రి ఎఒ బాబ్జి తెలిపారు.

నిరాశ్రయులకు వితరణ

ప్రజాశక్తి-వేపాడ

ఇటీవల భారీ వర్షాల కారణంగా మండలంలోని కొంపల్లి గ్రామంలో రెండు మిద్దె ఇళ్లు దెబ్బతిన్నాయి. కాకర బంగారయ్య, కాకర ఎర్రినాయుడు కుటుంబాలు నిరాశ్రయులు అయ్యాయి. దీంతో వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన వంటపాత్ర కిట్లు, రెండేసి రగ్గులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్‌పర్సన్ డాక్టర్ పి.వరలక్ష్మి, సభ్యులు దొడ్డి సూర్యారావు, ఆసపు మల్లేశ్వర రావు, డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని బలిఘట్టం, దెందేరు, చింతలదిమ్మె గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అంగన్వాడీ కార్యక్రమాలు, రికార్డులు, సరుకుల నిల్వలు తనిఖీలు చేశారు. టేక్ హోం రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. గృహ సందర్శన ద్వారా గర్భిణులు, బాలింతలు సక్రమంగా వినియోగిస్తున్నారో, లేదో చూడాలని సూచించారు. బలిఘట్టం, దెందేరులో ఉన్న పోషణవాటికలను తనిఖీ చేసి, అభివృద్ధి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఆర్.ఉమాదేవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి పురస్కారానికి గురుప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు, తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, సముద్రాల గురుప్రసాద్ తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగనున్న తెలుగు భాషా దినోత్సవంలో ప్రతిష్టాత్మక తెలుగు కీర్తి పురస్కారం ప్రదానం చేయనున్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో జరుగునున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, గిడుగు రామమూర్తి కుటుంబీకులు గిడుగు వేంకట రామకృష్ణారావు, గిడుగు కాంతికృష్ణ తదితరులు పాల్గొననున్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని గణేష్ ఉత్సవాలు జరుపుకునే ఉత్సవ కమిటీ ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు, ఎలక్ట్రికల్, అగ్నిమాపక కేంద్రం నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ మండపం ప్రతిష్ట చేసే స్థల యజమాని పర్మిషన్ కావాలన్నారు. పర్మిషన్ తీసుకున్న నిర్వహణ కమిటీ నెంబర్స్ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం చేసే సమయంలో రూట్ మ్యాప్‌ను ముందుగానే పోలీసులకు చెప్పాలన్నారు. రాజకీయ, మతపరమైన, ఇతర వ్యక్తులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా, నిమజ్జనం సమయంలో అశ్లీల నృత్యాలు, డీజేల శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మృతి చెందిన శ్యామల

మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ తుమరాడ శ్యామల (41) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. తుమరాడ శ్యామలకు జన్నివలసకు చెందిన వ్యక్తితో సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లలోపే దాంపత్య జీవితం పొసగక విడిపోయారు. అప్పటి నుంచి కన్నవారి ఊరు తారాపురంలోనే ఆమె ఒంటరి జీవితాన్ని గడుపుతోంది. ఆమెతో కొన్నేళ్లుగా ఇదే గ్రామానికి చెందిన దుంప భాస్కరరావుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున ఆమె అనుమానాస్పద స్థితిలో మరణించింది. మృతురాలి సోదరుడు సింహాచలం ఇచ్చిన ఫిర్యాదుతో ఎఎస్ఐ అప్పారావు, సిబ్బంది గ్రామానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. పురుగుల మందు సేవించిన ఆనవాళ్లు ఉన్నాయని ఎఎస్ఐ తెలిపారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కిరాణా షాపులో చోరీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరం మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. పూసర్ల బాలాజీకి చెందిన కిరాణా షాప్‌లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి షాపులో ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న పదివేల రూపాయల నగదు, సుమారు లక్ష రూపాయలు విలువచేసే సరుకులు అపహరించుకుపోయారని బాధితుడు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యాన క్లూస్‌టీమ్ పరిశీలించింది. దర్యాప్తు చేసినప్పటికీ ఎటువంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. ముఖ్యంగా లక్షలు విలువచేసే వ్యాపారం చేస్తున్న దుకాణ యజమానులు తప్పనిసరిగా షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.